క్లుప్తంగా

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కాసిపేట: మండలంలోని ఓసీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంకు కేటాయించిన పెద్దనపల్లి శివారులోని ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కాలనీలో చేపడుతున్న పనులను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మందమర్రి జీఎం దేవేందర్ మంగళవారం పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ల సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని గ్రామస్తులు కోరగా ఆర్డీవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోనెల శ్రీనివాస్, నాగపురి శ్రీనివాస్, దుర్గం శ్రీనివాస్, బూరుగుపల్లి రమేశ్, వెంబడి మహేశ్, ఎండీ రఫీ, మారం సంతోష్ తదితరులున్నారు.

గ్రంథాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం మంచిర్యాల డీఈవో యాదయ్య ప్రారంభించారు. పుస్తకాలు, ఫర్నిచర్, ప్లేట్స్, స్టీల్ వాటర్ బాటిల్స్, బ్యాండ్ ఇతరత్రా వస్తువులను అదే పాఠశాలలో విధులు నిర్వర్తించే ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు జ్యోతి సోదరుడు (జర్మనీ నివాసి) రవి విరాళంగా అందించారు. పాఠశాల అభివృద్ధికి సహాయం చేయడానికి ముందుకొచ్చిన రవిని డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో మాలవీదేవి, హెచ్ఎం పద్మజా, సెక్టోరల్ అధికారి చౌదరి, గ్రంథాలయ దాత రవి చట్ట, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చెన్నూర్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకునే జాగ్రత్తలను వాహనదారులకు పాటల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, కళాజాత బృందం సభ్యులు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

మంచిర్యాలటౌన్: క్రైస్తవ మైనారిటీ మహిళలకు అందించే ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మహిళలు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్‌లో tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు జర్నలిస్టుల సెమినార్

పాతమంచిర్యాల: టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం, మీడియా బాధ్యతలు అనే అంశంపై ఈ నెల 22న బుధవారం జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే మంచిర్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు డేగ సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయ మిత్రులు తప్పకుండా హాజరై సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు.

కళాకారులకు అభినందన



కళాకారులతో జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: ఇటీవల కోల్‌కతాలో కోలిండియా సాంస్కృతిక పోటీల్లో ఆర్కెస్ట్రా భాగంలో సింగరేణి మందమర్రి ఏరియా జట్టు ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఆర్కెస్ట్రా కళాకారులను మంగళవారం ఏరియా జీఎం దేవేందర్ అభినందించారు. తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

ఊరూరా గ్రామసభలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం ఊరూరా గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. అధికారులు హాజరై లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. అర్హులై ఉండి, జాబితాల్లో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పలుచోట్ల అధికారులను నిలదీయడంతో రసాభాస నెలకొంది.

- సంక్షేమ పథకాలకు ఎంపికైన వారి వివరాలు వెల్లడించిన అధికారులు
- అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అనర్హులను ఎంపిక చేశారంటూ పలుచోట్ల నిలదీతలు



జైపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

జైపూర్: మండల కేంద్రంతో పాటు పెగడపల్లి, ముదిగుంట, మిట్టపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, రేషన్‌కార్డు మంజూరైన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. కొంతమందికే రేషన్‌కార్డులు మంజూరు కావడంతో ప్రజలు అధికారులను ప్రశ్నించారు. మంజూరు కానివారు దరఖాస్తులు సమర్పించాలని, అర్హులందరికీ మంజూరు కోసం నివేదికలు పంపిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జెడ్పీసీఈవో గణపతి, ఎంపీడీవో సత్యనారాయణరావు, ఎంపీవో శ్రీపతిబాపురావు, ఆయా గ్రామాల్లో అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వేమనపల్లిలో...

వేమనపల్లి: ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం సుంపుటంలో తహసీల్దార్ రమేష్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్, ఏఈవో రుక్సార్ సుల్తానా, పంచాయతీ కార్యదర్శి వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం పాల్గొన్నారు.

దండేపల్లిలో...



దండేపల్లి: మండలంలోని అల్లీపూర్, గుడిరేవు, మాకులపేట, రాజుగూడ, నాగసముద్రం, కొత్త మామిడిపల్లి, కర్ణపేట, తానిమడుగు, వందురగూడ, చెల్కగూడ గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఏవో అంజిత్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాండూర్‌లో...

తాండూర్: మండలంలోని నర్సాపూర్‌లో జరిగిన గ్రామసభలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పాల్గొన్నారు. బోయపల్లి, మాదారం త్రీ ఇంక్‌లైన్, మాదారం, నీలయపల్లి, కిష్టంపేట గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో అత్యల్పమంది మాత్రమే హాజరయ్యారు. దీంతో గ్రామసభలు తూతూ మంత్రంగా సాగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎజాజుద్దీన్, అంజన్‌కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో...

లక్సెట్టిపేట: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డి అన్నారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. గుల్లకోట, లక్ష్మీపూర్, చందారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, రేషన్ కార్డులు రాలేదని, పేర్లు నమోదు కాలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. రెండో విడత మరో దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే అమలవుతాయని తెలుపడంతో దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ దిలీప్‌కుమార్, కమిషనర్ రాజశేఖర్ ఉన్నారు.

జన్నారంలో...

జన్నారం: మండలంలోని 19గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు ప్రారంభించారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ భానుచందర్, గంగరాజు, ఏవో సంగీత, ఎంపీవో జలందర్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, రైతు భరోసాకు ఎంపికైన వారి పేర్లు, రేషన్‌కార్డులకు ఎంపిక చేసిన వారి పేర్లను చదివి వినిపించారు. చింతగూడ, తపాలపూర్ గ్రామాల్లో గ్రామసభలో గందరగోళం ఏర్పడింది. అర్హులకు కాకుండా, అనర్హుల పేర్లను ఎంపిక చేయడంపై అధికారులను నిలదీశారు.

కాసిపేటలో...

కాసిపేట: మండలంలోని బుగ్గగూడ, చిన్నధర్మారం, గట్రావుపల్లి, కొండపూర్, కోనూర్, లంబాడితండా(డి), లంబాడితండా(కె), మామిడిగూడ, పెద్దనపల్లి, రొట్టెపల్లి, సోమగూడెం(కె) లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సబ్దర్ అలీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలకు మంజూరైన లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించారు.



చెన్నూర్‌లో...



అక్కపల్లిలో పాల్గొన్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డుల్లో వార్డు సభలు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి రేషన్ కార్డుల కోసమే పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు 1వ వార్డు ఆఫీసర్ యాదగిరి తెలిపారు. వార్డు సభలను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, ఆయా వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ మండల పరిధిలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి, చింతలపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో, ఏపీవో ఏఈవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటపల్లిలో...



ఆలుగామ గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారం, ఆలుగామ, సర్వాయిపేటలో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో లక్ష్మయ్య వివరాలు వెల్లడించారు. అనంతరం అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్వాయిపేటలో మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీ నవీన్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షలతోనే అక్రమ కేసులు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు, పార్టీ శ్రేణులు

నస్పూర్: రాజకీయ కక్షలతోనే తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్–ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రశాంత్ కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన తమ పార్టీ కార్యకర్త కందుల ప్రశాంత్‌పై ఎమ్మెల్యే ప్రోత్బలంతోనే పోలీసులు అకారణంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఆరోపించారు. పోలీసులు దుర్గం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను బెదిరించి అతడితో ప్రశాంత్‌పై ఫిర్యాదు చేయించారన్నారు. ఆఘమేఘాల మీద విచారణ జరిపి, ప్రశాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారని, అరెస్టును తాము ఖండిస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. మంచిర్యాలలో ప్రజాపాలన సాగడం లేదని పోలీస్ పాలన సాగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మీడియాను సైతం బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ప్రశాంత్‌పై అక్రమంగా కేసులు నమోదు చేసారని, తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్ వంగ తిరుపతి, రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు, నాయకులు హైమద్, మేరుగు పవన్, పానుగంటి సత్తయ్య, జనార్దన్, రవీందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద కౌలు రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

తాండూర్: మండలంలోని రేపల్లేవాడ శివారు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లు వద్ద మంగళవారం పత్తి సాగు చేసిన కౌలు రైతులు ఆందోళన చేశారు. పత్తి అమ్మకానికి తీసుకొచ్చిన కౌలు రైతుల నుంచి కేవలం 40క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని, అంతకు మించి పత్తి ఉంటే కొనుగోళ్లు చేయబోమని అధికారులు ఆంక్షలు పెట్టడంతో వివాదం మొదలైంది. అమ్మకానికి తెచ్చిన పత్తిని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాల్సిందేనని కౌలురైతులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమానులు, కౌలు రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, జిన్నింగ్ మిల్లు యజమానులతో మాట్లాడి యధాతథంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవడంతో ఆందోళనకు తెరపడింది.

బడీడు పిల్లల గుర్తింపు



చింతగూడలో సర్వే చేస్తున్న సీఆర్పీ రమేశ్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని చింతగూడెం, మద్దిమాడ, దేవాపూర్, పెద్దపూర్ గ్రామాల్లో మంగళవారం సీఆర్పీ రమేశ్ బడిఈడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. చింతగూడలో ముగ్గురు, మద్దిమాడలో ఇద్దరు, దేవాపూర్‌లో ఆరుగురు, పెద్దపూర్‌లో ఇద్దరిని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం వారిని పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్

దండేపల్లి: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో చిన్నయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ సూచించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నందునా విద్యార్థులకు మాదిరి ప్రశ్నపత్రాలతో పాటు, ప్రయోగాలు, బొమ్మలు గీయడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి అప్పాల మనోహర్, రిసోర్స్ పర్సన్లు పాత రమేశ్, రాజన్న, సీఆర్పీ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమంలో భాగస్వాములు కావాలి



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ ఉద్యమంలో మహిళలు భాగస్వాములు కావాలని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ హర్ష డిగ్రీ కళాశాలలో 2025సంవత్సరానికి గాను సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీతలు అలేఖ్య, ఆడెపు శ్యామలను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు వడ్డేపల్లి మనోహర్, డాక్టర్ రఘునందన్, కర్రే లచ్చన్న, పల్లే భూమేష్, గుమ్ముల శ్రీనివాస్, నటేశ్వర్, లతీఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించం

- నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి



మాట్లాడుతున్న వేణు, తిరుపతి

నస్పూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు హెచ్చరించారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన కుమారుడు విజిత్‌రావు ఎమ్మెల్యేను దూషించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త ప్రశాంత్‌పై నమోదైన కేసులో ఎమ్మెల్యేకు, తమ పార్టీ కార్యకర్తలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ తీసుకొని తిరిగి ఇవ్వకుండా ప్రశాంత్ తనను బెందిరిస్తూ, దూషించినట్లు దుర్గం వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ కేసు విషయంలో కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యేకు సంబంధం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల సంపత్ రెడ్డి, భూపతి శ్రీనివాస్, సతీష్ రావు, మడిగ మల్లయ్య, శోభ, తదితరులు పాల్గొన్నారు.

పోటీలతో పెరగనున్న నైపుణ్యం

మంచిర్యాలఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఒలింపియాడ్ పోటీలు విద్యార్థుల ఆంగ్లభాష నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తాయని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఒలింపియాడ్, ఎలక్యుషన్ పోటీలు నిర్వహించారు. 70మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన ఇంగ్లిష్ స్పెషల్ క్లాస్ ప్రాక్టిస్ బుక్ ఐపాస్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పోటీల విజేతలను ప్రకటించారు. ఇంగ్లిష్ ఒలింపియాడ్ స్ట్రీమ్–1 విభాగంలో దండేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి జస్విత్ ప్రథమ, లక్సెట్టిపేట జిల్లా పరిషత్ బాలిక పాఠశాలకు చెందిన తిరుమల ద్వితీయ, బాదంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కావ్య తృతీయ బహుమతి సాధించారు. స్ట్రీమ్–2 విభాగంలో మంచిర్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం.సంజన ప్రథమ, కాసిపేట మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీవాత్సవ ద్వితీయ, ఎలక్యుషన్ స్ట్రీమ్–1 విభాగంలో కలమడుగు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఆంజనేయప్రసాద్ ప్రథమ, కిష్టాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని అరవిందరాణి ద్వితీయ, మంచిర్యాల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థిని భవిష్య తృతీయ బహుమతి సాధించారు. స్ట్రీమ్–2 విభాగంలో టీఎస్ మోడల్ కాసిపేట్ విద్యార్థి అభివర్ధన్ ప్రథమ, టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థిని సాహిత్య ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సత్తయ్య, బాబ్జీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జైపూర్: జైపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఈసం సంజన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 22 నుంచి 24 వరకు ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ -17 బాలికల క్రికెట్ పోటీలకు జైపూర్ హైస్కూల్ నుంచి సంజన ఎంపికైనట్లుగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు శ్యాంసుందర్ తెలిపారు.

పశువైద్య శిబిరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గోపాలమిత్ర ఏఐ కేంద్రంలో పశుసంవర్ధక శాఖ, మంచిర్యాల జిల్లా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ, పశువైద్య, కృత్రిమ గర్భధారణ చికిత్సలు నిర్వహించారు. 39 గేదె జాతి పశువులకు, 21ఆవులకు పరీక్షలు నిర్వహించి కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 16దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. హాజీపూర్ మండల పశువైద్యాధికారిణి శాంతిరేఖ, కాసిపేట మండల పశువైద్యాధికారిణి ఈ.సరిత రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో గోపాల్ మిత్ర జిల్లా సూపర్‌వైజర్ ఏ.రవి, గోపాలమిత్ర రమేశ్, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించుకున్న భవనాలను ఎందుకు తొలగించడం లేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. పట్టణంలోని మార్కెట్లో గల బస్టాండ్ గోడ పక్కన ఇటీవల ఏర్పాటు చేసుకున్న టేలాలను తొలగించడంపై మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి నిలదీశారు. టేలాలను తొలగించినట్లు, అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తులను కూడా కూల్చివేయాలని కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

క్రికెట్ బ్యాట్లు అందజేత

భీమారం: గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ క్రీడాకారులకు మంగళవారం క్రికెట్ బ్యాట్లు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

సైకిళ్లు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్, దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ గ్రీన్ క్రాంప్స్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య మంగళవారం వారికి అందజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఆండాళమ్మ కాలనీలో లోఓల్టేజీ సమస్యతో తరుచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా మంగళవారం వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత ప్రారంభించారు.

చెన్నూర్: మున్సిపాలిటీలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని మంచిర్యాల ఎస్సీ వి.గంగాధర్ అన్నారు. గ్రంథాలయ కాలనీలో మంగళవారం 100కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈలు కైసర్, బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్ దొమకొండ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

చెన్నూర్: కిష్టంపేట గ్రామ శివారులోని సాయినగర్‌లో గల గ్రామ పంచాయతీ రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్‌కు కాలనీ వాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కట్ల శ్రీనివాసాచారి, పిల్లలమర్రి మల్లయ్య పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలు తొలగించాలి

చెన్నూర్: కోనో కార్పస్ మొక్కలను, చెట్లను తొలగించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సీపీఎం చెన్నూర్ ఏరియా కార్యదర్శి చందు తహసీల్దార్ మల్లికార్జున్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని నిర్వహించే క్రీడాపోటీలను డీటీ విజయ మంగళవారం ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఆమె సూచించారు.